క్లుప్తంగా

ఫ్యామిలీ డాక్టర్ విధానంపై సర్వే

లింగాల : లింగాల మండలంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంపై సర్వే నిర్వహించారు. రిమ్స్ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు, ఆశా వర్కర్లు మంగళవారం చిన్నకుడాల, రామట్లపల్లె గ్రామాల్లో ప్రజలకు అందుతున్న వివిధ వైద్య, సేవల గురించి తెలుసుకున్నారు. ఈ సర్వే కార్యక్రమాన్ని పీహెచ్‌సీ వైద్యులు సుభాషిణి, కళ్యాణ్ దినకర్‌లు పర్యవేక్షించారు. ఎంపీడీఓ సురేంద్రనాథ్, తహసీల్దార్ లక్ష్మీనారాయణలు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. చిన్నకుడాల సర్పంచ్ నాగేంద్రనాథ్‌రెడ్డి సర్వే సిబ్బందికి భోజన వసతి కల్పించారు.

వైఎస్సార్ ప్రెస్‌క్లబ్‌కు ఏసీ వితరణ

పులివెందుల రూరల్ : పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న వైఎస్సార్ ప్రెస్ క్లబ్‌కు 4వ వార్డు కౌన్సిలర్ పార్నపల్లె కిషోర్ సుమారు రూ.60 వేల విలువ గల ఏసీని వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రెస్ క్లబ్‌లో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధరరెడ్డిలు ఏసీని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి ఇతర సభ్యులకు అందజేశారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు సన్మానం

పులివెందుల రూరల్ : రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను మంగళవారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్ కిషోర్‌లు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు కోళా ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటలలో ఈ క్రాప్ నమోదు

లింగాల : లింగాల మండలంలో ఖరీఫ్ పంటల ఈ క్రాప్ నమోదు కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఇంతవరకు ఈ క్రాప్ నమోదు చేసుకోని రైతులు ఆర్‌బీకే వద్దకు వెళ్లి వారి పంటలను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ రమేష్ తెలిపారు.

రేపు వేంపల్లెలో కృష్ణాష్టమి వేడుకలు

వేంపల్లె : స్థానిక వడ్డెరవీధిలో వెలసిన శ్రీకృష్ణుని ఆలయంలో గురువారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు దేరంగుల రామాంజనేయులు తెలిపారు. భక్తులందరు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆత్మీయ కృతజ్ఞత సభ వాయిదా

వీరపునాయునిపల్లె : మండల కేంద్రంలోని వీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించాల్సిన ఆత్మీయ కృతజ్ఞత సభ అధిక వర్షాల కారణంగా శనివారానికి వాయిదా వేసినట్లు వీరపునాయునిపల్లె జేసీఎస్ చైర్మన్ లింగారెడ్డి వీరప్రతాప్ రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు.

పత్రికా సంపాదకులపై కేసులు నమోదు చేయడం తగదు

కమలాపురం : పత్రికా సంపాదకులపై బీజేపీ ప్రభుత్వం కేసులు నమోదు చేయడం హేయమైన చర్య అని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మంగళవారం కమలాపురంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా (ఈజీఐ) పత్రికా సంపాదకులు సీమా ముస్తఫా, ముగ్గురు సభ్యులపై బీజేపీ సర్కార్ కక్ష సాధింపు చర్యలకు దిగిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

సాగు చేసిన ప్రతి పంటను ఈ క్రాప్ చేయించుకోవాలి

వేముల : ఖరీఫ్‌లో సాగుచేసిన ప్రతి పంటను రైతులు ఈ క్రాప్ పంట నమోదు చేయించుకోవాలని ఏఓ చెన్నారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వేల్పుల, ముబ్బుచింతలపల్లె గ్రామాల్లో పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది మోహనకృష్ణ, అఖిలాష్ రెడ్డి పాల్గొన్నారు.

శాంతియుతంగా జీవించండి

కొండాపురం : గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరు శాంతియుతంగా జీవించాలని కొండాపురం సీఐ వేణుగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం తాళ్లప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ సుధాకర్ పాల్గొన్నారు

అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం

ఎర్రగుంట్ల : మహాత్మాగాంధీ అంతర్ రాష్ట్రీయ హిందీ విశ్వవిద్యాలయం (మహారాష్ట్ర)లో నిర్వహించనున్న అంతర్జాతీయ రాజనీతి శాస్త్ర సదస్సుకు ఎర్రగుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ చెమికెల రామమోహన్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఈ నెల 9, 10 తేదీలలో జరిగే ఈ సదస్సులో ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు అనే అంశంపై ఆయన ప్రసంగించనున్నారు.

అర్హులందరికీ పింఛన్లు

వీరపునాయునిపల్లె : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేస్తామని మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి అన్నారు. మంగళవారం గంగిరెడ్డిపల్లె సచివాలయ పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గురుదేవుళ్లకు వందనం


పులివెందుల టౌన్ : విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించిన చైర్మన్, తదితరులు


పులివెందుల రూరల్ : జేఎన్‌టీయూ కళాశాలలో రాధాకృష్ణన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ వసుంధర, సిబ్బంది


వేంపల్లె: సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ ఏపీ రాష్ట్ర కార్యదర్శి నర్రెడ్డి సంగమేశ్వరరెడ్డి


కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


కరస్పాండెంట్ రమణారెడ్డిని సన్మానిస్తున్న విద్యార్థినులు


మదర్‌థెరిస్సా, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాల వేస్తున్న డాక్టర్ వైఎస్ అభిషేక్‌రెడ్డి, చిన్నప్ప

పులివెందుల టౌన్ : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వైఎస్ రాజారెడ్డి భవన్(పాత ఎమ్మెల్యే కార్యాలయం)లో మంగళవారం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ప్రమీళ, డి.వి.గోపాల్ రెడ్డి, మునిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, నారాయణ స్వామి, రవీంద్రాచారి, శ్రీనివాసరెడ్డి, సోమేష్, సూర్యనారాయణ రెడ్డిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ హాల్ గంగాధర రెడ్డి, వైఎస్సార్ టీఎఫ్ నాయకులు వెంకటనాథ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రఘునాథ రెడ్డి, ఉపాధ్యాయులు, వాల్మీకి సంఘం డైరెక్టర్ అంబకపల్లె నారాయణ స్వామి, నూర్‌బాషా సంఘం అధ్యక్షుడు రసూల్, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, కౌన్సిలర్ పార్నపల్లి కిశోర్, నాయకులు యార్వ వెంకటసుబ్బయ్య, పద్మనాభరెడ్డి, రవి, మధుసూదన్ రెడ్డి, కృష్ణమూర్తి, సంపత్, నాగరాజు, సోమశేఖర్, ఫక్రుద్దీన్, చలపతి, సిద్దయ్య, శేఖర్, గంగిరెడ్డి, నాయుడు, బాషా, కుల్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ కళాశాలలో

పులివెందుల రూరల్ : పట్టణంలోని జేఎన్‌టీయూ కళాశాలలో ప్రిన్సిపల్ వసుంధర ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ ఆది యుగం నుంచి ఆధునిక యుగం వరకు గురువే అన్నిటికి మూలకారణమన్నారు. వైస్ ప్రిన్సిపల్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ దేవుడు, గురువు పక్క పక్కనే ఉంటే ముందు గురువుకే నమస్కారం చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారతీ స్కూల్‌లో..

వేంపల్లె : స్థానిక భారతి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్టీయూ ఏపీ రాష్ట్ర కార్యదర్శి నర్రెడ్డి సంగమేశ్వరరెడ్డి మాట్లాడుతూ అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని పంచి, ఒకతరం నుండి మరోతరానికి అందించే సారథి గురువన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవిత, కళావతమ్మ, నరసింహారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

వేంపల్లె జెడ్పీ హైస్కూలులో..

వేంపల్లె : తలిశెట్టి సుబ్రమణ్యం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శివమునెమ్మ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సీనియర్ ఉపాధ్యాయులు ఓబులేసు, దేవదానమయ్యలను ప్రధానోపాధ్యాయురాలు తమ సిబ్బందితో కలిసి సత్కరించారు. అలాగే వేంపల్లె స్టేట్‌బ్యాంకుఆఫ్ ఇండియా. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, డీసీఈబీ బ్యాంకుల సిబ్బంది ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


వేంపల్లె: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ఆదర్శ ప్రాయుడు సర్వేపల్లి

వేంపల్లె : అందరికీ ఆదర్శప్రాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి కొనియాడారు. అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, చరిత్ర అధ్యాపకుడు బాలకొండ గంగాధర్ మాట్లాడుతూ చదువు విలువను అందరికీ తెలిసేలా కృషిచేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ మార్గ నిర్దేశకులు గురువులే

వేంపల్లె : సమాజ మార్గ నిర్దేశకులు గురువులేనని స్థానిక ఉషాకిరణ్ పాఠశాల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి పేర్కొన్నారు. పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచంలో ఎన్ని వృత్తులున్నా అందరినీ తయారు చేసే ఉపాధ్యాయ వృత్తి అన్ని వృత్తులకన్నా గొప్పదన్నారు. 10వ తరగతి విద్యార్థినులు ఆయనను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

శ్రీ చైతన్య హైస్కూలులో..

వేంపల్లె : వేంపల్లె పట్టణంలోని శ్రీచైతన్య హైస్కూల్‌లో కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

మార్కెట్‌యార్డులో..

పులివెందుల రూరల్ : పులివెందుల వ్యవసాయ మార్కెట్ యార్డులో కమిటీ చైర్మన్ గోటూరు చిన్నప్ప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్యవిభాగం కార్యదర్శి డాక్టర్ వైఎస్ అభిషేక్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భారతరత్న, నోబెల్‌శాంతి బహుమతి గ్రహీత మదర్ థెరిస్సా 24వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి, అలాగే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులను డాక్టర్ వైఎస్ అభిషేక్ రెడ్డి, చిన్నప్ప, ఇన్‌చార్జి జేడీ శ్రీకాంత్‌రెడ్డి, ఏడీ ఆజాద్, వైస్ చైర్మన్ సర్వోత్తమ రెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ రాఘవేంద్రారెడ్డిలు ఘనంగా సత్కరించారు.

విద్యార్థులను తీర్చిదిద్దే గొప్ప శక్తి గురువు

కమలాపురం : విద్యార్థులను తీర్చి దిద్దే గొప్పశక్తి గురువు అని డీసీసీ బ్యాంక్ మేనేజర్ సుధీర్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక స్వామి వివేకానంద హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువు వల్లనే విద్యార్థి భవితవ్యం చక్కగా నిర్మితమవుతుందన్నారు. స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన టీచర్స్ డే కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పల్లా కృష్ణ మాట్లాడుతూ మాతృ దేవో భవ, పితృ దేవోభవ, ఆచార్య దేవోభవ అని కొనియాడబడుతున్న త్రిమూర్తుల స్వరూపమే గురువు అని తెలిపారు. పుట్లంపల్లె ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు సత్యనారాయణను స్థానిక కోదండ రామాలయంలో గ్రేటర్ వాసవీ క్లబ్, ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

గురువు రుణం తీర్చుకోలేనిది

వీరపునాయునిపల్లె : గురువు రుణం తీర్చుకోలేనిదని వెల్దుర్తి సర్పంచ్ విశ్వనాథ్ అన్నారు. మంగళవారం గ్రామంలోని పాఠశాలలో తమ స్నేహితులతో కలసి తమకు విద్య నేర్పిన గురువు కిరణ్ కుమార్‌రెడ్డిని సత్కరించారు. ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ పాఠ్య పుస్తకాల్లో ఉండదని గురువుల గుండెల్లో ఉంటుందన్నారు. అలాంటి క్రమశిక్షణే మనల్ని మంచి వైపు నడిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో 2002–2007 సంవత్సరానికి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.


రామసుబ్బారెడ్డిని సన్మానిస్తున్న డీసీసీ బ్యాంక్ మేనేజర్ సుధీర్‌కుమార్‌రెడ్డి


గురువును సన్మానిస్తున్న పూర్వపు విద్యార్థులు

ఉపాధ్యాయులు భవిష్యత్తుకు మార్గదర్శకులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి


మానవత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

జమ్మలమడుగు : ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బాలాజీ ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ దీప్తి నిఖిలారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గురువులు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేవారన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డి రవీంద్రారెడ్డి, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని శ్రీ గౌతం హైస్కూల్ ఆవరణంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ శివప్రసాద్ హాజరై ప్రసంగించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ రఘురామిరెడ్డి, అధ్యక్షుడు జీరెడ్డి మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి

– ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం


షాదీఖానా వద్ద పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులలో భాగంగా నూతనంగా నిర్మించిన మున్సిపల్ భవనం, పబ్లిక్ హెల్త్ కేంద్రం, బ్రిడ్జి పనులు, షాదీఖానా వద్ద నిర్మాణంలో ఉన్న ప్రహరీలను మంగళవారం జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పరిశీలించారు. ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలంటూ మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో ఎర్రగుంట్ల అభివృద్ధిని అప్పటి నేతలు గాలికి వదలేశారని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి పనులు జోరుగా జరిగాయన్నారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో భాగంగా దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహావిష్కరణ ఉంటుందన్నారు. ఈ విగ్రహాన్ని ఎర్రగుంట్ల వాసి, సాక్షి మీడియా గ్రూపు డైరెక్టర్ యర్రంరెడ్డి ఈశ్వరప్రసాద్‌రెడ్డి అందించారన్నారు. ఈ నెల 8వ తేదీన జరగనున్న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని ఆయన కోరారు. మున్సిపల్ కమిషనర్ పి. జగన్నాథ్, కో–ఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సీనియర్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక

జమ్మలమడుగు : ప్రభుత్వ డిగ్రీ కాలేజికి చెందిన జి.శ్రీనివాసులు అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి సీనియర్ షూటింగ్ పోటీలకు ఎంపికైనట్లు కాలేజి ప్రిన్సిపల్ చంద్రశేఖర్, పీడీ షఫీలు పేర్కొన్నారు. ఈనెల 8న కావలిలో జరిగే పోటీలలో పాల్గొంటాడన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'ను జయప్రదం చేయండి

పులివెందుల టౌన్ : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ కోరారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో కలిసి ఆయన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై సచివాలయాల అడ్మిన్, రెవెన్యూ, సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో ఆటల పోటీలలో ఎక్కువ మంది పాల్గొనేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మునికుమార్, ఎంఈఓ వీరారెడ్డి, పీఈటీ కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పోషకాహార లోప నివారణకే పోషణ్ పక్వాడా

కమలాపురం : చిన్నారులు, బాలింతలు, గర్భిణుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోషణ్ పక్వాడాను ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షంషాద్ బేగం తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి జరుగుతున్న పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం 7వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా–2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న వైఎస్సార్ కిట్ (అటుకులు, రాగి పిండి, బెల్లం, కర్జూరం, చిక్కి), దాల్, రైస్, ఆయిల్, కోడిగుడ్లు, బాలామృతం, పాలు తదితర పోషకాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, జ్యోతి, రాణి, లక్ష్మీదేవి, గౌసియా, ఎలిజబెత్ రాణి, కిరణ్‌కుమారి, తులసి, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : మండలంలోని రామిరెడ్డి పల్లె గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో పోషణ మా సంబరాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు సెక్టార్–2 పరిధిలో పోషణ మా సంబరాలను సైపర్‌వైజర్ నాగరత్న ప్రారంభించారు.

ఘనంగా డాక్టర్ పురుషోత్తంరెడ్డి వర్ధంతి

- నివాళులర్పించిన కుటుంబ సభ్యులు
- వృద్ధులు, అంధులకు దుప్పట్లు పంపిణీ

పులివెందుల టౌన్ : అంధుల బాంధవుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.పురుషోత్తంరెడ్డి 5వ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు ఆయన సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పట్టణంలోని శ్రీవీరనారాయణ స్వామి అంధుల ఆశ్రమంలో డాక్టర్ పురుషోత్తంరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు మైఖేల్ సత్యానందరెడ్డి, కోడలు అమూల్యారాణి దంపతుల ఆధ్వర్యంలో వృద్ధులకు, అంధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. స్థానిక వికలాంగుల కార్యాలయంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వైఎస్ అభిషేక్‌రెడ్డి హాజరై డాక్టర్ పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ పురుషోత్తం రెడ్డి మనువరాలు డాక్టర్ వింధ్య సమకూర్చిన గృహోపకరణాలను వికలాంగులకు పంపిణీ చేశారు. అంతకుముందు వైఎస్ సమాధుల తోటలో డాక్టర్ పురుషోత్తంరెడ్డి సమాధికి ఆయన కుమారుడు వైఎస్ థామస్‌రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త వైఎస్ ప్రకాష్‌రెడ్డి, ఫిలిప్, సాంబయ్య తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్ అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ పురుషోత్తంరెడ్డి సౌమ్యుడు, స్నేహశీలి, మృదుస్వభావి, అజాతశత్రువుగా, అందరివాడిగా గుర్తింపు పొందారన్నారు. అత్యుత్తమ నేత్ర వైద్యునిగా, అసంఖ్యాకంగా నేత్రశస్త్ర చికిత్సలు నిర్వహించి ఎంతో మంది కళ్లలో వెలుగులు నింపిన మహనీయుడన్నారు. ఆయన మరణానంతరం తన కళ్లను దానం చేసి ఇద్దరు అంధులకు చూపును అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బ్రదర్‌ఘుకర్, శ్రీనివాసులరెడ్డి, దస్తగిరి, నాని, యోహాను, మహి, సునీల్, జగదీశ్, ఆశ్రమ నిర్వాహకులు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.


వికలాంగులకు గృహోపకరణాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ వైఎస్ అభిషేక్‌రెడ్డి

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

కమలాపురం : కమలాపురం మండలంలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ కార్యాలయంలో విద్యుత్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు నెలల క్రితం కమలాపురంలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలు ఎంత వరకు పరిష్కారం అయ్యాయో ఏఈ చాంద్ బాషాను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. వర్షాకాలం కావడంతో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.


సంబటూరు ప్రసాద్‌రెడ్డి

షూట్ లేకుండా చీనీకాయల కొనుగోలు


సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, శ్రీకాంత్ రెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల మార్కెట్‌యార్డులో షూట్ లేకుండా చీనీకాయలు కొనుగోలు చేయనున్నట్లు మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, ఇన్‌చార్జి జేడీ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం మార్కెట్‌యార్డులో అధికారులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సూచనలతో పాడా ఓఎస్‌డీ అనిల్ కుమార్‌రెడ్డి సలహాలతో షూట్ వ్యవస్థ నిర్మూలనకు చర్యలు తీసుకుంటామన్నారు. పులివెందుల ప్రాంతంలోని రైతులు, వ్యాపారులు మార్కెట్‌యార్డులో చీనీ క్రయవిక్రయాలు జరుపుకోవచ్చన్నారు. ఇందుకు చీనీ రైతులు, వ్యాపారులు ప్రతి ఒక్కరు సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆజాద్, హార్టికల్చర్ అధికారులు రాఘవేంద్రారెడ్డి, రెడ్డయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలోనే సంతృప్తి

ఆత్మీయ కృతజ్ఞత సమావేశంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లినప్పుడు ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించడంలోనే సంతృప్తి ఉందని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక గోసుల కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారమై ప్రజలు సుఖంగా ఉన్నప్పుడు కలిగే సంతోషం అంతా ఇంతా కాదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టి గల నాయకుడు కనుకే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. గతంలో ఏవైనా సమస్యలు ఉంటే ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే వారని, నేడు ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా రాజేంద్రనాథ్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పులి సునీల్ కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ ముదిరెడ్డి దిలీప్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఆర్‌వీఎస్ఆర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అల్లి శ్రీరామమూర్తి, జేసీఎస్ మండల కన్వీనర్ నిరంజన్‌రెడ్డి, నాయకులు ముదిరెడ్డి సుబ్బారెడ్డి, అన్వర్ బాషా, శ్రీనివాసరాజు, వలంటీర్లు, జేసీఎస్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి